ఆక్రమణలో పంట కాలువలు

ఆక్రమణకు కాదేదీ అనర్హం అని అక్రమార్కులు నిరూపిస్తున్నారు. స్థలాల ధరలకు రెక్కలు రావడంతో పంట కాలువలను సైతం వదలడం లేదు. యథేచ్ఛగా ఆక్రమించుకుని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో చెరువులు, పంట పొలాలకు వెళ్లే వర్షపు నీరు ఇళ్ల మధ్యలోకి చేరుతున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు కనుమరుగైతే చెరువులు, పంట పొలాలకు నీరు ఎలా చేరుతుందని ప్రశ్నిస్తున్నారు.

- ఇళ్ల మధ్యలోకి చేరుతున్న వర్షపు నీరు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


కోటలో ఆక్రమణకు గురైన కాలువ

కోట: స్వర్ణముఖి నది నీటిని పొలాలకు తరలించేందుకు గతంలో చల్ల కాలువను ఏర్పాటుచేశారు. ఈ కాలువ కోట పట్టణం గుండా దిగువన ఉన్న ప్రాంతాలకు వెళుతుంది. స్వర్ణముఖి పంట కాలువ కోట క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభమై కోటలోని రవినగర్, ఎస్సీఆర్ నగర్, ఆకుతోటదిబ్బ వీధి, బజారు వీధి గుండా దిగువకు నీటిని తీసుకువెళుతుంది. 4 కిలోమీటర్లు పొడవు ఉంది. ఈ కాలువ ద్వారా 591 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అదేవిధంగా కోట కొత్తచెరువుతో పాటు వంజివాక, అల్లంపాడు చెరువులకు నీటిని తీసుకెళ్లే పంట కాలువలు కూడా కోట మీదుగా వెళుతున్నాయి. ఈ చెరువుల కింద సుమారు 300 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. స్థలాల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు కోట పట్టణం గుండా వెళుతున్న పంట కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. ఇలా కోటలో 2 కిలోమీటర్ల మేర కాలువల పైనే నిర్మాణాలున్నాయి. గతంలో 5 మీటర్ల వెడల్పుతో ఉన్న పంట కాలువలు 5 అడుగులకు కుచించుకుపోయాయి. ఆకుతోటదిబ్బ వీధిలో కొన్ని చోట్ల కాలువలు కనుమరుగయ్యాయి. దీంతో వర్షం పడితే నీరంతా రవినగర్‌ను చుట్టుముడతాయి. ఈ ప్రాంతం జలదిగ్బంధంలో చిక్కుకుంటోంది. అలాగే జరుగుమల్లి పంటకాలువ ఎస్సీఆర్ నగర్‌లో పలుచోట్ల ఆక్రమణకు గురైంది. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉండగా గతంలో పలు పర్యాయాలు ప్రభుత్వం పంట కాలువల మరమ్మతులకు, పూడికతీతకు నిధులు కేటాయించింది. అధికారులు పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను ఆక్రమణ నుంచి కాపాడి వర్షపు నీరు చెరువులకు వెళ్లేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


కోట ఎన్సీఆర్ నగర్ వద్ద పంట కాలువ దుస్థితి


చెత్త, వ్యర్థాలతో పూడిపోతున్న పంట కాలువ

నిధులు రాగానే పనులు మొదలుపెడతాం

పంట కాలువలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిన వారికి కోట పంచాయతీ ద్వారా ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. వారు ఇచ్చే సమాధానాలను బట్టి తొలగింపులు చేపడతాం. కొన్ని చోట్ల కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాటికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాం. అలాగే పూడికతీత చేపట్టడానికి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు మొదలుపెడతాం.

– మునీంద్ర, ఇరిగేషన్ శాఖ ఏఈఈ

పంట కాలువలు కనుమరుగవుతున్నాయి



మా ఊరి సమీపంలో ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది నుంచి నీటిని చెరువులకు చేరేలా గతంలో కాలువలు ఏర్పాటుచేశారు. కొంతమంది స్వార్థంతో వాటిని ఆక్రమించుకున్నారు. కొన్నిచోట్ల కాలువలు ఉన్నా పూడిక తీయకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి. స్వర్ణముఖి నది ఉద్ధృతంగా ప్రవహించినా పంట కాలువల ఆక్రమణలకు గురికావడంతో చెరువుల్లోకి నీరు చేరడం లేదు. – రమేష్‌బాబు, కోట

ఎన్నో సార్లు ఫిర్యాదు చేశాం



ఒకప్పుడు కాలువలు విశాలంగా ఉండేవి. వర్షపు నీరు చెరువులకు చేరేది. పంటలు పండించుకునేవాళ్లం. ఇప్పుడు కాలువలు కుచించుకుపోయాయి. కొంతమంది ఆక్రమించుకున్నారు. కాలువలు ఉన్న చోట పూడిపోయి అధ్వానంగా మారాయి. పంట కాలువల ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేశాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– నారాయణరావు, కోట

పంట కాలువలను కాపాడుకుంటేనే మనుగడ



కోట పట్టణం గుండా వెళుతున్న స్వర్ణముఖి పంట కాలువలను కాపాడుకోవాలి. కాలువలు కనుమరుగైతే వరద నీరు నివాసాలను ముంచెత్తుతుంది. అంతేగాక చెరువులు ఎండిపోతాయి. భూ గర్భ జలాలు అడుగంటుతాయి. అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న కాలువలను రక్షించాలి. అలాగే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలి.

– అన్వర్‌బాషా, కోట

బస్టాండ్‌ను బాగు చేయండి మహాప్రభో...



సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో బస్సులు నిలిచే ప్రాంతం గుంతలమయమై అధ్వానంగా ఉంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో నీరు నిలిచింది. వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చి బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

నాయుడుపేట టౌన్ : ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు డీటీ మాగర్ల రాజేంద్ర తెలిపారు. మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

కండలేరులో 6.268 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.268 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 60, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

అక్కరపాకలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

దొరవారిసత్రం : మండలంలోని అక్కరపాక గ్రామంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు అందజేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి తరుణ్, వైద్య సిబ్బంది శివగాయత్రి, రుక్మిణి, చంద్రమ్మ ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జిల్లా జైలులో కామాంధుడు

దొరవారిసత్రం: మండలంలోని నెలబల్లి గ్రామ అటవీ ప్రాంతంలో బాలిక(8)పై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడు దిలీప్‌కుమార్‌సదా(22) జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. బీహార్ రాష్ట్ర దర్భాంగా ప్రాంతానికి చెందిన కుటుంబం పిల్లలతో కలిసి వారం క్రితం నెలబల్లి గ్రామ శివారులో ఉన్న రైస్ మిల్లు లో వంట పని చేసేందుకు వచ్చింది. వారి కుమార్తె రైస్ మిల్లు ఆవరణలో ఆడుకుంటోంది. అక్కడే పనిచేస్తున్న బీహార్ రాష్ట్రం బేహెరి ప్రాంతానికి చెందిన దిలీప్‌కుమార్‌సదా బాలికకు మాయమాటలు చెప్పి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లాడు. ఆమెపై లైంగిక దాడి చేసి కొట్టి తువాలుతో గొంతు నులిపి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు రైస్ మిల్లులోని సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ జరిపి రోజుల వ్యవధిలోనే అతనిపై రేప్ అండ్ మర్డర్ కేసు నమోదు చేశారు. అరెస్టు చేసి జిల్లా జైలుకు తరలించారు.

27న మండల సమావేశం

రాపూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు రాపూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచులు, మండల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు ఇస్తున్న వెంకటేశ్వర్లు

రాపూరు: మండలంలోని సిద్దవరం పంచాయతీ కోటూరుపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం గుమ్మ వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డీజిల్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

చిల్లకూరు : సాగరమాల రోడ్డు పనులు చేసే మెగా కంపెనీకి చెందిన వాహనాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ చోరీ చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు నుంచి తూర్పుకనుపూరు వరకు మెగా సంస్థ సాగరమాల రోడ్డు పనులు చేపడుతోంది. ఈ పనులకు పలు వాహనాలను వినియోగిస్తోంది. తిక్కవరం ప్రాంతంలో నిలివేస్తున్న వాహనాల నుంచి రాత్రిళ్లు డీజిల్ చోరీ చేస్తున్నట్టు గుర్తించారు. దీనిపై అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సామాజిక తనిఖీలపై గ్రామసభ


గ్రామ సభలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ రవి

చిల్లకూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే క్షేత్ర సహాయకులు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించి ఉంటే తెలపాలని ఎస్ఆర్‌పీ రవి తెలిపారు. మండలంలోని కమ్మవారిపాళెంలో సోమవారం ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కింద చేపట్టిన పనుల్లో కూలీలకు వేతనాలు అందాయా.. లేదా అని తెలుసుకున్నారు. ఎవరికైనా జాబ్ కార్డులు ఇవ్వడంలో ఆలస్యం చేసి ఉంటే రాత పూర్వకంగా కానీ నోటి మాట ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం గ్రామంలో జరిగిన పనుల్లో సామాజిక తనిఖీ బృందం చేపట్టిన తనిఖీల వివరాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏపీవో గిరిబాబు, ఇంజినీర్ మల్లికార్జున్, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలు కీలకం


మావిళ్లపాడులో నవధాన్యాల వినియోగంపై రైతులకు అవగాహన

దొరవారిసత్రం : ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలు కీలకమని, వాటి సాగుతో భూమి సారవంతం అవుతుందని తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయ యాంకర్ రవిచంద్రప్రసాద్ తెలిపారు. మావిళ్లపాడు గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసే పంటలను పరిశీలించారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన చెంగయ్య ఎకరా భూమిలో చిరుధాన్యాలు, పప్పుదినుసులు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, ఆకు కూరలు, కూరగాయలు తదితర 30 రకాల విత్తనాలు 14 కేజీలను కలిపి చల్లారు. అవి పెరిగిన తర్వాత పచ్చిరొట్ట ఎరువుగా భూమిలో కలియ దున్నవచ్చన్నారు. లేదా 40 నుంచి 50 రోజులు పెంచి పశువులకు మేతగా వినియోగించుకోవచ్చని వివరించారు.

ఘనంగా నగరోత్సవం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని అగ్రహార పేటలో సోమవారం రాత్రి సాయి నాథుని నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం బాబాకు పాలాభిషేకం చేశారు. రాత్రి బాబా ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం చేశారు.


పట్టణంలో సాయినాథుని నగరోత్సవం

ఆడపిల్లలను చదవనిద్దాం


చిల్లకూరులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ

చిల్లకూరు : పిల్లలను బడికి పంపించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబి పిలుపునిచ్చారు. చిల్లకూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆడ బిడ్డలను గర్భంలోనే చిదిమేస్తున్నారని, ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక దాడులు పెరిగాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్యోతికిరణ్, సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక పాల్గొన్నారు.


చిట్టమూరులో బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చందన

చిట్టమూరులో...

చిట్టమూరు మండలం మల్లాంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, బాడ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ చందన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నేడు ప్రతి పాఠశాలలోనూ న్యాప్‌కిన్లు ఉంచుతున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొంత మంది కావాలనే తాకుతుంటారని, చెడుగా అనిపిస్తే పెద్దవారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా జెట్టీ

వాకాడు : మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో ఉప్పునీటి కోసం 1990లో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల వంతెన(జెట్టీ) ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన దాదాపు 200 మీటర్లు సముద్రంలోకి ఉంది. సుమారు 40 మీటర్లు ఎత్తు ఉంటుంది. ఇది 20 ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. జెట్టీ బాగా దెబ్బతిని పిల్లర్లలో సిమెంటు పెచ్చులు ఊడిపోయి తుప్పుపట్టిన ఇనుప కమ్మీలు దర్శనమిస్తున్నాయి. కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ జెట్టీ వద్దకు కొందరు చేరుకుంటున్నారు. మద్యం సేవించి వంతెన పైకి ఎక్కి సముద్రంలోకి దూకుతున్నారు. గతంలో అనేక మంది విద్యార్థులు ఇక్కడ మృత్యువాత పడ్డారు. అలాగే బీచ్‌కు వచ్చిన పర్యాటకులు జెట్టీ కిందకు చేరుకుని సేదతీరుతుంటారు. శిథిలావస్థకు చేరుకున్న వంతెన ఎప్పుడు కూలుతుందోనని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు. జెట్టీ నిర్మాణ ప్రాంతంలో కెరటాల ఉధృతితోపాటు లోతు కూడా ఎక్కువగా ఉంటుంది. తూపిలిపాళెం గ్రామ సమీపాన మొదటి ఘాట్‌లో పర్యాటకులకు స్నానాలు చేసేందుకు అనువుగా ఉన్నప్పటికీ, ఎక్కువ మంది సముద్రం అందాలను చూసేందుకు వంతెన వద్దకు వెళుతుంటారు. అధికారులు స్పందించి వంతెన కూలక ముందే కూల్చేయాలని స్థానికులు కోరుతున్నారు. అంతవరకు పోలీసులు నిఘా ఏర్పాటుచేయాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.


తూపిలిపాళెం సముద్ర తీరంలో ప్రమాదకరంగా ఉన్న జెట్టీ


జెట్టీ కింద కునుకు తీస్తున్న పర్యాటకులు

నాయుడుపేటలో స్తంభిస్తున్న ట్రాఫిక్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వాహనాలను నిర్లక్ష్యంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని దర్గా వీధి, బజారు కూడలి వీధులు, పిళ్లారిగుడి వీధి, గడియారం సెంటర్ నిరంతరం రద్దీగా ఉంటాయి. ఇక్కడ కొంతమంది తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దర్గా వీధిలో సాధారణంగా రోడ్డు మధ్యలో మోటార్ బైక్‌లను నిలుపుతుంటారు. కొందరు వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా నిలిపేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఆయా ప్రాంతాల్లో పోలీసులను నియమించి ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


దర్గా వీధి కూడలి రోడ్డులో నిర్లక్ష్యంగా నిలిపిన బైక్‌లు

కార్యాలయాల మధ్య అడ్డుగోడలు

- ప్రభుత్వ కార్యాలయాలను వేరుచేస్తూ ప్రహరీగోడల నిర్మాణం
- ఎన్నికల బదిలీలో వచ్చిన తహసీల్దార్‌కు అంత అవసరం ఏంటో మరి!



తహసీల్దార్ కార్యాలయానికి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి మధ్య నిర్మించిన ప్రహరీ గోడ

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మండలానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ప్రజలకు ఎంతో సౌకర్యంగా కూడా ఉంది. ఎన్నికల బదిలీల్లో ఇక్కడకు వచ్చిన తహసీల్దార్ మండల రెవెన్యూ కార్యాలయానికి, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి మధ్య ప్రహరీగోడ నిర్మించారు. అదే విధంగానే మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వున్న పాతదారిని మూసివేయించి గోడను నిర్మించారు. ఎప్పుడో బ్రిటీష్ వారి కాలం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా తాలూకా ఉన్నప్పుడూ అలాగే నడిచాయి. అప్పట్లో తహసీల్దార్, సబ్ ట్రెజరీ, బీడీవో, సబ్ రిజిస్ట్రార్, గృహ నిర్మాణశాఖ కార్యాలయాలతోపాటు రికార్డు రూమ్ అన్నీ ఒకే ప్రాంగణంలో వుండేవి. టీడీపీ ఆవిర్భావం తర్వాత మండలాల వ్యవస్థ రావడంతో తహసీల్దార్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాలకు మాత్రమే భవనాలు ప్రత్యేకంగా నిర్మించారు. బ్రిటీష్ వారు నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరడంతో సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని అద్దె గదిలో నిర్వహిస్తున్నారు. అప్పటి నుంచి ఒకే ప్రాంగణంలో వున్న కార్యాలయాలను ఎన్నికల నిర్వహణ పేరుతో తహసీల్దార్ విడదీసే ప్రయత్నాలు చేసి ముందుగా ఫెన్సింగ్ వేశారు. ఎన్నికలు పూర్తయ్యాక ఏకంగా గోడలు నిర్మించారు. అదేమంటే ఎంపీడీవో ఎన్నికలకు సంబంధించి కార్యాలయాన్ని ఇవ్వకపోవడంతో ఈ పని చేశారనే ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా కార్యాలయాలకు అడ్డుగోడలు నిర్మించడాన్ని అధికార పార్టీ నేతలు, ఉన్నత స్థాయి అధికారులు సమర్థించడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక అధికారి ఇలా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని గోడలు నిర్మించడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదని పెదవి విరుస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి దారేదీ!

మండల రెవెన్యూ అధికారి గోడను నిర్మించడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి దారి లేకుండా పోయింది. ఈ కార్యాలయానికి వచ్చే వారు బాపూజీ కాలనీకి రోడ్డులో తిరుక్కుని రావాల్సి వస్తోంది. తహసీల్దార్ ప్రహరీగోడ ఎప్పుడు నిర్మించారో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వారు దక్షిణంవైపు రోడ్డుకు రింగ్ గేట్‌గా వున్న దాన్ని పీకేసి గేట్ ఏర్పాటు చేసి తాళాలు వేసేస్తున్నారు. దక్షిణం వైపు గోడపై ఫెన్సింగ్ వేసి ఎవరూ లోపలికి రాకుండా చేశారు.

ఇక్కడే పాతుకుపోవడానికి ప్రయత్నాలు

ఎన్నికల బదిలీపై వచ్చిన తహసీల్దార్ సూళ్లూరుపేట పట్టణంలోనే పాతుకుపోవడానికి అధికార పార్టీ నాయకుల ప్రాపకం కోసం పని చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన చర్యలను అధికార పార్టీ నేతలు కూడా సమర్థిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల బియ్యం అక్రమ రవాణా చేస్తున్న లారీని పోలీసుల సహాయం తీసుకోకుండా ఒక్కరే పట్టుకున్నారు. టీడీపీ నేతలు చెప్పగానే ఒక్కడే వెళ్లి లారీని పట్టుకున్నందుకు ఇరకందీవిలో తహసీల్దార్‌కు మంచి పార్టీ ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది.


మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి దారి లేకుండా అడ్డంగా నిర్మించిన గోడ


శిథిలమైపోతున్న బ్రిటీష్ వారు నిర్మించిన పాత తహసీల్దార్ కార్యాలయం

కమనీయం.. స్వామివారి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, ఉభయదారులు

సైదాపురం: మండలంలోని కలిచేడు సమీపంలో వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణం, పల్లకీ సేవ చేపట్టారు. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకం, పూలంగి సేవ చేపట్టారు. ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో కామాక్షిదేవి, సిద్ధేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి విశేషంగా అలంకరించి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా డాక్టర్ రవికుమార్, నూనె బ్రదర్స్ వ్యవహరించారు.